
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
సోమవారం 23 సెప్టెంబరు 2024



వాహనాల తనిఖీ

ధారూరు, సెప్టెంబరు 22: జిల్లాలో ఆదివారం పలు చోట్ల చైన్‌స్నాచింగ్‌లు జరగడంతో ధారూరులో పోలీసులు తనిఖీ చేపట్టారు. దొంగలను పట్టుకునేందుకు తాండూర్-వికారాబాద్ మార్గంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్, సిబ్బంది ధారూరు పోలీసు స్టేషన్ ముందు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. కాగా నెంబర్ ప్లేట్లు లేని 15వాహనాలను గుర్తించి వారి పత్రాలను పరిశీలించి జరిమానా విధించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

త్వరలోనే పరిగిలో సీఎం పర్యటన

● ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 22 : త్వరలోనే పరిగిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిగిలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ఉంటాయని తెలిపారు. రూ.2500కోట్లతో ఏర్పాటు చేయనున్న నేవీరాడార్ ప్రాజెక్టుకు పూడూరు దామగుండంలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అదేవిధంగా అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రూ.800కోట్లతో చేపట్టనున్న నాలుగులైన్ల రహదారి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. పరిగి మునిసిపాలిటీలో రూ.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. రూ.20కోట్లతో సీసీరోడ్ల నిర్మాణ పనులు, రూ.5కోట్లతో మునిసిపల్ కార్యాలయం నిర్మాణం, రూ.16కోట్లతో నీటి వసతి కోసం ట్యాంకుల నిర్మాణం, పైపులైన్‌ల ఏర్పాటుకు శంకస్థాపన చేస్తారని తెలిపారు. పూడూరులో నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటులో కొందరు అసత్యప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నేవీరాడార్ స్టేషన్‌తో ఎవరికి ముప్పు ఉండదన్నారు. అడవిలో చెట్లను అసలు నరకరని, కొద్ది భూభాగంలో రాడార్ స్టేషన్ ఏర్పాటవుతుందని తెలిపారు. చెట్లు, జంతువులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. అభివృద్ధి గిట్టని కొందరు స్వార్థపరులు అసత్యప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. నేవీరాడార్ స్టేషన్ వల్ల టౌన్‌షిప్ ఏర్పాటవుతుందన్నారు. పిల్లలకు ఇంటర్నేషనల్ స్కూల్, ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. పరిగి మీదుగా రైల్వేలైను నిర్మాణం, పాలమూరు ఎత్తిపోతల పథకాలను సాధించి తీరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, బి.వెంకటయ్య, ఎంఈవో హరిశ్చందర్, గట్యానాయక్, కద్మూరు ఆనందం, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దండిగా వరి సాగు

సగటుకు మించి పంట వేసిన రైతులు

వికారాబాద్‌లో సాగు అత్యధికం

ఇదిలా ఉంటే, ఈ వానాకాలం వికారాబాద్‌లో అత్యధికంగా రైతులు పంటలు సాగు చేశారు. వికారాబాద్ జిల్లాలో ఈ సీజన్‌లో 92.83శాతం వివిధ పంటలు వేయగా, రంగారెడ్డి జిల్లాలో 81.62శాతం, మేడ్చల్ జిల్లాలో 93శాతం పంటలు సాగు చేశారు. నెల రోజులుగా భారీ వర్షాలు పడడంతో భూగర్భజలాలు కూడా ఆశించిన స్థాయిలో పెరిగాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 25శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది వికారాబాద్ జిల్లాలో రికార్డుస్థాయిలో వర్షాలు కురిశాయి. ఇప్పటివరకు దాదాపు 33శాతం అధిక వర్షపాతం నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లాలో 26శాతం, మేడ్చల్ జిల్లాలో 19శాతం అధిక వర్షం కురిసింది.

ఉమ్మడి జిల్లాలో వరి సాగు గణనీయంగా పెరిగింది. ఈ వానాకాలం సీజన్‌లో నెలరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో అంచనాలకు మించి వరి పంట వేశారు. నెల రోజుల కిందట అంతంత మాత్రంగానే ఉన్న సాగు.. వాతావరణం అనుకూలించడంతో గరిష్ఠస్థాయికి చేరింది. అంతేకాకుండా క్వింటాల్ సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో వరిసాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపారు.

- సన్నాలకు సర్కారు బోనస్ ప్రకటనతో ఆసక్తి
- ఉమ్మడి జిల్లాలో తగ్గిన ఇతర పంటల విస్తీర్ణం
- రంగారెడ్డి జిల్లాలో పత్తి సాగు అంతంతే
- వికారాబాద్‌లో పెరుగుదల

(వికారాబాద్/మేడ్చల్ ,ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భ జలాలు పెరగడంతో పాటు చెరువులు, కుం టలు నిండాయి. దీంతో వర్షాధార పంట అయిన వరి ని రైతులు అధికంగా సాగు చేశారు. ఇందులో సగాని కి పైగా సన్నాలు సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది దాదాపు 30శాతం అధికంగా రైతులు వరి సాగు చేయడం గమనార్హం.

పత్తి సాగు ఇలా..

ఉమ్మడి జిల్లాలో పత్తిసాగు ఈ ఏడాది గణనీయంగా పెరుగుతుందని ఆశించినప్పటికీ వికారాబాద్ జిల్లాలో మాత్రమే పెరిగింది. ఇక్కడ ఇప్పటికే సగటుకు మించి రైతులు పత్తి పంట వేశారు. ఇంకా మరికొంత విస్తీర్ణంలో సాగు పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో వానాకాలం సీజన్‌లో సగటున 2,31,338 ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తుండగా ఇప్పటికీ 2,41,592 ఎకరాల్లో సాగైంది. ఇక రంగారెడ్డి జిల్లాలో సగటున 1,77,735 ఎకరాల్లో పత్తి సాగు చేస్తుండగా ఈసారి 1,23,297 ఎకరాల్లో మాత్రమే వేశారు. ఈ జిల్లాలో దాదాపు 50వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు తగ్గింది. వాస్తవానికి గత ఏడాది పత్తికి మంచి గిట్టుబాటు ధర లభించడంతో ఈ ఏడాది సాగు గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గత ఏడాది పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని 20శాతం పత్తి పంట సాగు లక్ష్యాలను పెంచింది. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రంగారెడ్డి జిల్లాలో సాగు గణనీయంగా తగ్గింది. అధిక వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో వేసిన పంట కూడా దెబ్బతింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 3వేల ఎకరాలకు పైగా పత్తి పంట వర్షాలకు పాడైంది. అలాగే వర్షాల కారణంగా కొన్ని వేల ఎకరాల్లో పత్తి పంట దిగుబడులు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సాధారణం	ప్రస్తుతం	శాతం
రంగారెడ్డి	3,96,899	3,23,957	81.62
వికారాబాద్	5,77,508	5,36,088	92.83
మేడ్చల్	23,026	21,416	93.01

వరి సాగు వివరాలు (ఎకరాల్లో)

జిల్లా	సగటు	ప్రస్తుతం
రంగారెడ్డి	1,00,608	1,28,780
వికారాబాద్	99,549	1,30,000
మేడ్చల్	16,651	17,636

పత్తి సాగు వివరాలు (ఎకరాల్లో)

జిల్లా	సగటు	ప్రస్తుతం
రంగారెడ్డి	1,77,735	1,23,297
వికారాబాద్	2,31,338	2,41,592
మేడ్చల్	401	77



తాండూరు జిల్లా ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటర్‌కు కేటాయించిన భవనం

ట్రామా కేర్‌లెస్!

- తాండూరులో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటయ్యేనా?
- జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- మెరుగైన వైద్య సేవలకు నగరానికి పరుగులు
- సమయానికి చేరుకోలేక మధ్యలోనే మృత్యువాత

తాండూరు, సెప్టెంబరు 22: రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యాయత్నాలు, గాయాలపాలైన వారికి ప్రథమ చికిత్స అందించి మృత్యుబారిన పడకుండా కాపాండేందుకు తాండూరులో ఏర్పాటు చేస్తామన్న ట్రామాకేర్ సెంటర్ ప్రకటనలకే పరిమితమైంది. గత ప్రభుత్వం తాండూరులో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు తాండూరులో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకూ దాని ఏర్పాటుకు అడుగు ముందుకు పడడం లేదు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా జాతీయ రహదారుల వెంబడి 74 ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తాండూరు నియోజకవర్గం మీదుగా ఎన్‌హెచ్ -165 భూత్‌పూర్, కర్ణాటకలో మన్నెకేళ్లి వరకు విస్తరించనున్నారు. మరో జాతీయ రహదారి తాండూరు నుంచి పెద్దేముల్ మీదుగా జహీరాబాద్‌కు అనుసంధానమవుతుంది. ఈ జాతీయ రహదారుల వెంబడి ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినందున ఈ క్రమంలో సీఎం జిల్లా వికారాబాద్‌లోని తాండూరులో ట్రామాకేర్ ఏర్పాటుకు అనువుగా ఉంది.

రెండు రకాల ఎమర్జెన్సీ సేవలు

తాండూరులో ట్రామాకేర్ ఏర్పాటు చేస్తే రెండు రకాల ఎమర్జెన్సీ సేవలు అందనున్నాయి. ఒకటి నాన్ వెహిక్యూలర్ ట్రామా సేవలు, రెండోది వెహిక్యూలర్ ట్రామాసేవలు. ఇందులో నాన్ వెహిక్యూలర్ ట్రామాలో కాలిన గాయాలు, ఆత్మహత్యయత్నాలు, అత్యాచార కేసులు, కత్తిపోట్లు, గన్‌షాట్స్ కరెంటుషాక్‌లు, నీళ్లలో మునిగిపోవడం తదితర కేసులు పరిష్కారం కానున్నాయి. వెహిక్యూలర్ ట్రామాలోకి రోడ్డు ప్రమాదాలు వస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో నాన్ వెహిక్యూలర్ కేసులు ఎక్కువగా వస్తాయి. బాధితులను అత్యవసర విభాగంలో ఉంచి వైద్య సేవలందించడం రెండోవది. డ్యామేజ్ కంట్రోల్ సర్జరీ మూడోవది. కచ్చితమైన సంరక్షణ నాల్గవది. రిహాబిటేషన్ ఐదోదశ. అయితే మూడు దశల్లో ట్రామాకేర్ కేంద్రాల్లో వైద్య సేవలందుతాయి. 4, 5వ దశల్లో ఆస్పత్రులకు రెఫర్ చేస్తూ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలందిస్తారు.

అందుబాటులోకి వస్తే..

జిల్లాలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటైతే ఆర్థోపెడిక్ (ఎముకల వైద్యుడు) , న్యూరోసర్జన్ (నరాలకు సంబంధించిన వైద్యుడు), అనస్తీషియాలిస్ట్, సిటీ టెక్నీషియన్, జనరల్‌సర్జన్, ల్యాబ్ టెక్నీషియన్, పైలెట్ డ్రైవర్, మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు, ఎమర్జెన్సీ రూమ్, టెక్నిషియన్లతో పాటు ఎమ్మారై స్కానింగ్ పరికరాలు అందుబాటులో ఉంటాయి.

వంద కిలో మీటర్లు వెళ్లాల్సిందే..

జిల్లాలోపెద్ద ఆస్పత్రులు లేకపోవడంతో మెరుగైన వైద్య సేవల కోసం 100 కిలోమీటర్లు వెళ్లాల్సిందే. వైద్యులు రెఫర్ చేస్తే అత్యవసరాలకు హైదరాబాద్, సికింద్రాబాద్‌లకు తరలించాల్సిందే. అక్కడి వెళ్లే వరకు ప్రాణాలు ఉంటాయో పోతాయో తెలియని పరిస్థితి. జిల్లాలో 200 పడకల ఆస్పత్రి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో మెరుగైన వైద్యసేవలకు హైదరాబాద్‌లోని, ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆస్పత్రి, లేదా ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తుంది. దీంతో తీవ్ర గాయాలైన వారు సకాలంలో చికిత్స అందకపోవడంతో మార్గ మధ్యలో మరణిస్తున్న ఘటనలు కోకొల్లలు.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది



తాండూరులో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ప్రభుత్వం పరిశీలనలోఉంది. ప్రతిరోజు తాండూరు ఆస్పత్రికి పది రోడ్డు ప్రమాదాలు కేసులు వస్తాయి. మేజర్ కేసులు రెఫర్ చేయాల్సి వస్తున్నది. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటైతే ఇక్కడ మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

- డాక్టర్ రవిశంకర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్,తాండూరు

మూడు జిల్లాల ప్రజలకు ప్రయోజనం

తాండూరులో ట్రామాకేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే వికారాబాద్ జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రం ప్రజలకు మేలు జరగనుంది. రోడ్డు ప్రమాద బాధితులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. వికారాబాద్ జిల్లాతో పాటు నారాయణపేట, మెదక్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు ప్రజలకు ఉయోగంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ కేంద్రం ఏర్పాటు అయితే సీఎం నియోజకవర్గం కొడంగల్, తాండూరు నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.



నాగారం ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు

ఉప్పొంగిన వరద

కీసర/ ఘట్‌కేసర్, సెప్టెంబరు 22: నాగారంలో శనివారం రాత్రి వర్షం దంచికొట్టింది, దీంతో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు నాగారం ప్రధాన రహదారిపై పొంగిపొర్లింది. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న బీఎంఆర్‌ఎన్‌క్లేవ్, అరవింద్ నగర్‌కాలనీ, సాయినగర్ కాలనీ తదితర ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా ఆదివారం ఘట్‌కేసర్‌లో 20 నిముషాల పాటు ఏకధాటికి కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమై భారీ వాన కురిసింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలకు జీవం పోసిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రక్తదానం అత్యవసరాల్లో ప్రాణదానం

కొడంగల్, సెప్టెంబరు 22: రక్తదానం చేయడంతో అత్యవసర సమయాల్లో మరొకరి ప్రాణాలను కాపాడుతుందని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొడంగల్‌లోని షాబజార్‌లో మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తల్లిదండ్రులు జన్మనిస్తే రక్తదానం నిండుజీవితం అర్ధంతరంగా ముగిసిపోకుండా కాపాడుతుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, ఎస్‌ఎం.గౌసన్, ఆసిఫ్ ఖాన్, హాఫీజ్ ఎంఏ.రషీద్, కరీం తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రాంభించిన గురునాథ్‌రెడ్డి

రూ.2కోట్ల నగదు చోరీ

35 తులాల బంగారు ఆభరణాల అపహరణ ● మక్తాలో భారీ దొంగతనం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.2కోట్ల నగదు, 35తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధి మక్తా గ్రామానికి చెందిన బైన గారి నాగభూషణం ఈనెల 18వతేదీన శంకరపల్లిలోని తన భూమి విక్రయించగా అడ్వాన్స్‌గా రూ.2కోట్లు వచ్చాయి. ఆ డబ్బును సోమవారం మరోవ్యక్తికి ఇచ్చేది ఉండటంతో బ్యాంక్‌లో జమ చేయకుండా ఇంట్లోనే డ్రెస్సింగ్ టెబుల్‌లో భద్రపరిచాడు. నాగభూషణం రోజూ మాదిరిగానే భార్య పద్మకు చెప్పి ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఇంటి మెయిన్‌డోర్‌కు బయట నుంచి గడియపెట్టి నారపల్లిలోని డెయిరీ ఫామ్‌కు వెళ్లాడు. అదే అదనుగా భావించిన దుండగులు ఇంట్లోకి చొరబడి డ్రెసింగ్ టెబుల్ వద్ద ఉన్న రూ. 2కోట్ల నగదు ఉన్న బ్యాగ్‌తో పాటు బీరువాలోని 35 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. భార్య పద్మ లేచి చూసేసరికి మెయిర్‌డోర్ తెరిచి ఉండటంతో భయపడి లోపలికి వెళ్లిచూడగా డ్రెసింగ్ టెబుల్‌లో నగదు ఉన్న బ్యాగ్, బీరువాలోని బంగారు అభరణాలు కనిపించలేదు. దీంతో కంగారుపడి భర్త నాగభూషణంకు సమాచారం అందించింది. ఇంటికి చేరుకున్న భర్త నాగభూషణం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాజు సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును గమనించి మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణికి దృష్టికి తీసుకెళ్లారు. పరిసరాలను పరిశీలించిన క్లూస్‌టీం ఇంట్లో ఆధారాలను సేకరించింది. నాలుగు బృందాలుగా ఏర్పడి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఏసీపీ తెలిపారు. డ్రైవర్ రవితో పాటు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. బాధితుడు నాగభూషణానికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నగదు, బంగారు అభరణాలు చోరీకి గురికావడంతో భార్య పద్మ బోరున విలపించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, పోలీసులు




ఇందిరానగర్ కాలనీలో ఇళ్లపై నుంచి 33 కేవీ విద్యుత్ లైన్


బుడగ జంగాల కాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్

హైటెన్షన్

ఇళ్ల మీద నుంచే 33/11 కేవీ విద్యుత్ లైన్ల ఏర్పాటు

- కాలనీ వాసుల భయాందోళన
- వేరే ప్రాంతం నుంచి వేయాలని వేడుకోలు

వికారాబాద్, సెప్టెంబరు 22: హై టెన్షన్ వైర్లు కాలనీ వాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో ఇళ్ల పై నుంచి 33 కేవీ విద్యుత్ లైన్ వెళుతుండగా.. ఆ పక్కనే బుడగ జంగాల కాలనీలో 11కేవీ విద్యుత్ లైన్ వెళుతోంది. వానొచ్చినా, గట్టిగా గాలి వీచినా ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలో ఉన్న విద్యుత్ స్థంభాలు సైతం కొన్ని పాతవి కావడంతో ఎప్పుడు కిందపడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై గతంలో పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు.

గతంలో రూ.16 లక్షలు కేటాయింపు

గతంలో కాలనీ వాసులు శ్రీనివాస్‌గౌడ్ కాలనీలో నెలకొన్న విద్యుత్ లైన్ సమస్యపై అప్పటి ఎంపీ రంజిత్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దాంతో ఎంపీ రూ. 16 లక్షలు కేటాయించారు. విద్యుత్ లైన్ ఇళ్ల మీద నుంచి కాకుండా వేరే మార్గంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆ పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం ప్రభుత్వం, ఎమ్మెల్యే, ఎంపీలు మారడంతో కాలనీ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పాలకులు, జిల్లా అధికార యంత్రాంగం ఇందిరానగర్ కాలనీలో నెలకొన్న సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భయాందోళన మధ్య జీవిస్తున్నాం



కాలనీలో విద్యుత్ లైన్ ఇళ్లపై నుంచి వేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక భయపడుతున్నాం. మా ఇంటిపై నుంచి 33 కేవీ విద్యుత్ లైన్ వెళుతోంది. అలాగే కాలనీలో చాలామంది ఇళ్లపై నుంచే ఈ లైన్ ఉండడం, బుడగ జంగం కాలనీలో 11కేవీ లైన్ సమస్యగా మారింది. అధికారులు, పాలకులు స్పందించి లైన్‌ను వేరే దారిగుండా వేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- నాగారం ఆనంద్

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక


సాయిశ్రీ

తాండూరు రూరల్, సెప్టెంబరు 22 : తాండూరు మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన కొనింటి సాయిశ్రీ జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైంది. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో సాయిశ్రీ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచింది. హైజంప్, లాంగ్ జంప్, రన్నింగ్‌లలో గోల్డ్‌మెడల్ సాధించింది. దాంతో అక్టోబరు 19, 20, 21వ తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. గౌతాపూర్‌కు చెందిన విద్యార్థిని జాతీయ క్రీడల్లో రాణించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

షాట్‌పుట్‌లో హస్నాబాద్ విద్యార్థి సాయికిరణ్


గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రాన్ని చూపుతున్న సాయికిరణ్

కొడంగల్ రూరల్ : కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండల పరిధి హస్నాబాద్‌కు చెందిన సాయికిరణ్ అథ్లెటిక్స్‌లో దూసుకుపోతున్నాడు. ఈనెల 21న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని షాట్‌పుట్ విభాగంలో సాయికిరణ్ 6కేజీల బరువును 16.21 మీటర్ల దూరం విసిరి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన సాయికిరణ్‌ను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. అక్టోబరు 19న ఏపీలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు సాయికిరణ్ తెలిపారు. గ్రామానికి చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ నుంచి తెచ్చుడు..
హైదరాబాద్‌లో అమ్ముడు

- డబ్బు సంపాదనే లక్ష్యంగా గంజాయి స్మగ్లర్స్‌గా మారిన కుటుంబం
- హెచ్ న్యూ పోలీసులకు చిక్కి కటకటాలపాలైన భార్యా భర్తలు సహా ఇద్దరు కుమారులు



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాబాద్‌కు చెందిన ఓ ఆటోడ్రైవర్ బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి రాజేంద్రనగర్‌లో ఉంటూ ప్యాసింజర్ ఆటో నడుపుతున్నాడు. వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో తన భార్య ఇద్దరు కొడుకులతో కలిసి గంజాయి సరఫరా చేస్తూ అడ్డదారిలో డబ్బు సంపాదిస్తున్నాడు. చివరకు హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) పోలీసులకు చిక్కి కుటుంబంతో సహా.. కటకటాలపాలయ్యారు. డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌కు చెందిన బ్యాగరి అనంతయ్య (53) కొన్నాళ్లుగా కుటుంబంతో సహా.. రాజేంద్రనగర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య నీరజ, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, రవికాంత్ ఉన్నారు. భార్య ఇంట్లోనే ఉంటుండగా.. పెద్దకొడుకు ఉబర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే వచ్చే సంపాదన సరిపోకపోవడంతో అనంతయ్య తన భార్య, కొడుకులతో చర్చించి సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషించారు. నగరంలో గంజాయికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో గంజాయి సరఫరా చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు.

ఆదిలాబాద్ నుంచి నగరానికి దిగుమతి..

ఆదిలాబాద్‌కు చెందిన గంగన్న మొదట వ్యవసాయం చేసేవాడు. ఆ తర్వాత వ్యవసాయం వదిలేసి గంజాయి సప్లైయర్‌గా మారాడు. మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ ప్రాంతాలకు చెందిన రైతుల వద్ద గంజాయిని సేకరించి దాన్ని నగరంలోని ప్రధాన స్మగ్లర్స్‌కు సరఫరా చేస్తున్నాడు. గత రెండేళ్లుగా గంగన్న ఆదిలాబాద్ నుంచి గంజాయిని తెచ్చి అనంతయ్యకు ఇచ్చేవాడు. ఆ తర్వాత అనంతయ్య భార్య నీరజ గంజాయిని చిన్ని చిన్న పొట్లాలుగా ప్యాకింగ్ చేసేది. వాటిని అనంతయ్యతో పాటు.. ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, రవికాంత్‌లు తీసుకెళ్లి నగర శివారు ప్రాంతాల్లోని గంజాయి సేవించే కస్టమర్స్‌కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్‌న్యూ ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాస్, డేనియల్ టీమ్ అఫ్జల్‌గంజ్ పోలీసులతో కలిసి ఎంజీబీఎస్ బస్టాండ్‌లో అనంతయ్యను, ఆదిలాబాద్‌కు చెందిన గంగన్నను పట్టుకున్నారు. అనంతరం అనంతయ్య భార్య నీరజ, చిన్న కొడుకు రవికాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయి, ఒక ఆటో, రూ. 3,400 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈనెల 27న బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్
దేవి 70 - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ (ఒక రోజు మాత్రమే)

శాంతి 70ఎంఎం - నారాయణగూడ | శ్రీదేవి 70 ఎ/సి - చిలకలగూడ
తారకరామ 70 ఎ/సి - కాచిగూడ | జ్యోతి 70 ఎ/సి - ఆర్‌సిపురం
వెంకటరమణ పద్మావతి - కాచిగూడ | శ్రీ కృష్ణ 70 ఎ/సి - ఉప్పల్
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్ | రాజ్యలక్ష్మి 70 ఎ/సి - ఉప్పల్
రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ | ఆరాధన 70 ఎ/సి - తార్నాక
మెగా 70ఎంఎం - దిల్‌సుఖ్‌నగర్ | సర్వశి 70 ఎ/సి - అల్వాల్
శ్రీసాయిరాజా 70 - ముషీరాబాద్ | వైజయంతి 70 ఎ/సి - నాచారం
రామకృష్ణ 70ఎంఎం - అబిడ్స్ | సాయిరంగ 70 - మియాపూర్
ప్రశాంత్ ఎ/సి - సికింద్రాబాద్ | శ్రీరమణ 70ఎంఎం - అంబర్‌పేట
అంజలి ఎ/సి - సికింద్రాబాద్ | శ్రీరమణ 35ఎంఎం - అంబర్‌పేట
రంగ 70ఎంఎం - జీడిమెట్ల | రాఘవేంద్ర 70 - జిబిగనర్
గోకుల్ 70ఎంఎం - ఎర్రగడ్డ | మరియు మీ అభిమాన థియేటర్లలో

ఈనెల 28న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
GLOBAL CINEMAS RELEASE



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND



సుదర్శన్ 35 - ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ 11.15,2.30,6.15,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

విజయవంతమైన 3వ వారం



సెన్సేషన్ సన్‌షైన్ 70ఎంఎం - ఖైరతాబాద్ 6.30pm
GLOBAL CINEMAS RELEASE



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
రామకృష్ణ 70ఎంఎం ఎ/సి - అబిడ్స్ | మహలక్ష్మి 70ఎంఎం ఎ/సి - కొత్తపేట | లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
MYTHRI MOVIE DISTRIBUTORS LLP



డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న వెంకటాపూర్ గ్రామస్తులు, పక్కన మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

'డబుల్' ఇళ్లు ఇవ్వడంలో మల్లారెడ్డి విఫలం

ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 22 : స్థానికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వడంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి విఫలమయ్యారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. పోచారం మున్సిపల్‌లోని ప్రతాప్‌సింగారం, వెంకటాపూర్‌లలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను స్థానికులకు అందజేయాలని కోరుతూ ఆదివారం వెంకటాపూర్ వాసులు ఎంపీ ఈటలను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్లారెడ్డి నియోజకవర్గాన్ని గాలికి వదిలేశారని, బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను స్థానికులకు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానికులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లను కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నీరుడి రామారావు, నాయకులు జంగయ్య, వినోద్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కళాశాల ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ ప్రదానం

ఆదిభట్ల, సెప్టెంబరు 22 : ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని ఏవీఎన్ కళాశాలలో డేటా సైన్స్ విభాగం ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ప్రొఫెసర్ రేవతి దుర్గం పీహెచ్‌డీ అందుకున్నారు. హైదరాబాదుకు చెందిన రేవతి దుర్గం.. హైబ్రిడ్ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్స్ అనే అంశంపై ప్రొఫెసర్ దేవరకొండ నాగరాజు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను పీహెచ్‌డీ అందుకున్నారు. విట్-ఏపీ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందిన రేవతి దుర్గం కళాశాల సహచరులతో సంతోషాన్ని పంచుకున్నారు. యాజమాన్యం విద్యార్థులు అభినందించారు.



పీహెచ్‌డీ అందుకుంటున్న ప్రొఫెసర్ రేవతి దుర్గం

పెద్దగుట్ట తండాను గూడూర్‌లో కలపొద్దు

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఉప్పల దయానంద్, గ్రామస్తులు

కొత్తూర్, సెప్టెంబరు 22: మండల పరిధిలోని మక్తగూడ గ్రామపంచాయతీలో ఉన్న పెద్దగుట్టతండాను గూడూర్ జీపీలో కలుపవద్దని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉప్పల దయానంద్‌గుప్తా ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గూడూర్ జీపీలో ఉన్న పెద్దగుట్టతండాను మక్తగూడలో కలిపి నూతన జీపీగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తిరిగి పెద్ద గుట్టతండాను గూడూర్ జీపీలో కలపాలని తండావాసులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపినట్లు దయానంద్ పేర్కొన్నారు. గూడూర్ మాజీ సర్పంచ్ సత్తయ్య, నాయకులు గుండె సురేష్, పద్మారావు, రమేష్, అశోక్, మల్లేష్, శివరాజు తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 22: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని, ముఖ్యంగా బాలికలు తప్పకుండా నేర్చుకోవాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని గ్రీన్ గార్డెన్‌లో ఆదివారం జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఫరూఖ్‌నగర్ మండలం కడియాలకుంట తండాకు చెందిన జశ్విక మొదటి స్థానం పొందగా ఎమ్మెల్సీ బాలికను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్లు నరేందర్, రాహుల్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా నిధుల కేటాయింపు



పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర, సెప్టెంబరు 22: అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయించడం జరుగుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.45లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు చంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 22: పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పోచారం మున్సిపాలిటీలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో అంతర్జాతీయ రేబిస్ డే సందర్భంగా పోచారం మున్సిపాలిటీ, బ్లూక్రాస్ సంస్థ ఆధ్వర్యంలో పెంపుడు, వీధి కుక్కలకు టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ జంతువుల ద్వారా మానవులకు కొన్ని రకాల వ్యాధులు సోకుతాయని గుర్తుచేశారు. ప్రధానంగా కుక్కలను పెంచుకునే వారు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. ఈసందర్భంగా 320 కుక్కలకు టీకాలు వేసినట్లు తెలిపారు. మరో 35 కుక్కలను పట్టుకున్నట్లు బ్లూక్రాస్ ప్రతినిధులు తెలిపారు. కౌన్సిలర్ హరిప్రసాదరావు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సంస్కృతి టౌన్‌షిప్‌లో వీధి కుక్కలకు రేబిస్ టీకాలు వేస్తున్న బ్లూక్రాస్ సిబ్బంది

మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి


నాయకుల పోటాపోటీ

- బడా నేతల మెప్పు కోసం ఆశావహులు యత్నం
- శామీర్‌పేట్, మూడుచింతలపల్లి మండల నాయకులకే ప్రాధాన్యం
- నువ్వా-నేనా అంటున్న శంకర్‌గౌడ్, నర్సింహులు యాదవ్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 22 : మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కించుకునేందుకు కాంగ్రెస్ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలో పలుకుబడి, బడా నేతల అండదండలతో ఇప్పటికే కొందరు నాయకులు పైరవీలు ప్రారంభించారు. ప్రభుత్వం నామినేటెడ్ పదవులను రద్దు చేసిన విషయం విధితమే. దాంతో మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం కోసం తిరిగి నోటిఫికేషన్ జారీ చేయటంతో పలువురు నాయకులు తమ దృష్టిని మార్కెట్ కమిటీ వైపు కేంద్రీకరించారు. మేడ్చల్, శామీర్‌పేట, కీసర, కప్రా, మూడుచింతలపల్లి, కుత్బుల్లాపూర్, నిజాంపేట్ మండలాలను కలుపుతూ ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ కొత్త సారథి ఎవరనే విషయమై సర్వత్రా చర్చ కొనసాగుతోంది. మార్కెట్ కమిటీ ఏర్పాటైనప్పటి నుంచి ప్రతీ మండలానికి ఒకసారి చైర్మన్ పదవి ప్రాప్తించే అవకాశం కల్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరుసగా రెండు దఫాలు చైర్మన్ పదవి మేడ్చల్ మండలానికి చెందిన నాయకులకు ఇచ్చారు. ఈసారి వేరే మండలాలకు చెందినవారికి ఇవ్వనున్నట్లు సీనియర్ నాయకులు యోచిస్తున్నందున.. మేడ్చల్ మండలానికి చెందిన నేతలు చైర్మన్ పదవిపై ఆశలు వదులుకున్నారు. ప్రస్తుతం శామీర్‌పేట లేదా మూడు చింతలపల్లి మండలాలకు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం. మార్కెట్ కమిటీ పరిధిలోని చాలా వరకు మండలాల్లో వ్యవసాయం అంతగా లేనందున.. ఎక్కువ ఉన్న మండలాలకు అవకాశమిస్తే రైతులకు పూర్తిస్థాయిలో సేవలందుతాయన్న ఉద్దేశ్యంతో సీనియర్లు మూడుచింతలపల్లి, శామీర్‌పేట మండలాలకు చెందిన నేతలకే చైర్మన్ పదవి కట్టబెట్టాలని నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. చైర్మన్‌తో పాటు 18మంది డైరెక్టర్ల నియామకం పట్ల పార్టీ నేతలు తర్జనభర్జన పడుతున్నారు. చైర్మన్ కోసం రెండు మండలాల నాయకులు గట్టిగా యత్నిస్తుండగా.. వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం మిగతా మండలాల నాయకులు యత్నిస్తున్నారు. మొదట్లో మార్కెట్ కమిటీ పరిధిలోని అన్ని మండలాల నుంచి పోటీ ఉన్నప్పటికీ పార్టీ అధిష్ఠానం రైతులు అధికంగా ఉన్న మండలాలకే ప్రాధాన్యత కల్పిస్తామని తేల్చి చెప్పటంతో మిగతా మండలాలకు చెందిన నేతలు చైర్మన్ పదవిపై ఆశలు వదులుకుంటున్నారు.



వై.శంకర్‌గౌడ్



నర్సింహులు యాదవ్

ఆ ఇద్దరి మధ్యే ఇగట్టి పోటీ!

కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం శామీర్‌పేట మండలాధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, మూడుచింతలపల్లి మండలాధ్యక్షుడు నర్సింహులు యాదవ్‌ల మధ్య గట్టి పోటీ కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు నాయకులు చైర్మన్ పదవి దక్కించుకునేందుకు పార్టీ పెద్దల మెప్పుకోసం పెద్దఎత్తున పైరవీలు చేస్తున్నారు. పార్టీ నియోజకవర్గ వ్యవహారాల్లో కీలక నిర్ణయాలు తీసుకునే అధికారం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిలకు అప్పగించటంతో ఈ ముగ్గురు నేతల నిర్ణయం కీలకంగా మారింది. వారి మెప్పు కోసం చైర్మన్ పదవి కొరకు పోటీ పడుతున్న నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ నర్సింహులు యాదవ్‌కు మద్దతు పలుకుతుండగా, వై.శంకర్‌గౌడ్‌కు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మద్దతు ఇస్తున్నట్లు జోరుగా ప్రచారం కొనసాగుతోంది. కాగా, పోటీ పడుతున్న ఇద్దరు నేతలూ బీసీ వర్గానికి చెందిన వారు కావటంతో వారిని సముదాయించి ఒకరికి చైర్మన్ పదవి ఇవ్వటానికి పార్టీ పెద్దలు యత్నిస్తున్నారు. ఆ ఇద్దరు కూడా ఒప్పుకోని పరిస్థితుల్లో పార్టీ పెద్దలు ప్రత్యామ్నాయంగా రెడ్డి సామాజిక వర్గ నాయకుడికి చైర్మన్ పదవి అంటగట్టినా ఆశ్చర్యపోనక్కరలేదని కొందరు నాయకులు బాహాటంగానే అంటున్నారు. నేతల మధ్య పెరిగిన పోటీ తత్వంతో పార్టీ పెద్దలు ఎవరి వైపు మొగ్గు చూపుతారో వేచి చూడాల్సిందే.



షాబాద్ : సభ్యత్వ నమోదులో పాల్గొన్న శ్రీధర్‌రెడ్డి



పెద్దేముల్ : మంబాపూర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రమేశ్, తదితరులు

దేశప్రగతి బీజేపీతోనే సాధ్యం

షాబాద్/పెద్దేముల్ : దేశ ప్రగతి బీజేపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కక్కులూర్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం మోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి చేరేవిధంగా చూడాలన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, ప్రతీ పల్లెలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బూత్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్, విష్ణు, సురేష్, నరేష్, రాము గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పరి రమేష్ అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సారథ్యంలో భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దనున్నారని, దేశ భవిష్యత్తు, భద్రత బీజేపీతోనే సాధ్యమని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, కార్యవర్గ సభ్యులు సందీప్‌కుమార్, భూమె నర్సింహ, శంకర్‌జీ, రవీందర్, పట్లోళ్ల రవికుమార్, సాయికుమార్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రామచంద్రారెడ్డి

బంట్వారం, సెప్టెంబరు 22: రైతులు రుణాలు సకాలంలో చెల్లించాలని వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే మరికొంతమంది రైతులకు రుణాలు ఇచ్చేందుకు ఆవకాశం ఉంటుందన్నారు. మండలంలోని బొపునారం, తొరమామిడి, బస్వాపూర్ గ్రామాల్లో ఎక్కువ శాతం అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటికి కూడా రుణాలు ఇచ్చేందుకు వెసులుబాటు కల్పించాలని, పట్టా భూమి ఎకరానికి రూ.3లక్షల వరకు రుణం ఇచ్చేలా చొరవ తీసుకోవాలని రైతులు కోరారు. త్వరలోనే నివేదికలు తయారు చేసి సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామమని చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుధాకర్ గౌడ్, బల్వంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేపట్టాలి

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి



శంషాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

శంషాబాద్, సెప్టెంబరు 22 : ఎస్సీ వర్గీకణ జిల్లాల వారీగా చేపట్టాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేపట్టాలని, 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ మేలుకొలుపు యాత్ర చేపట్టారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం యాత్ర శంషాబాద్‌కు చేరుకుంది. ఉమ్మడి పది జిల్లాల్లో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలని, కొన్ని జిల్లాల్లో మాదిగలు అధికంగా ఉన్నారని తెలిపారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో మాదిగలకు 14 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ప్రభుత్వం కమిటీ వేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని జిల్లాల్లో మేలుకొలుపు యాత్ర నిర్వహిస్తామన్నారు. మాలలు, మాదిగలు, లంబాడాలు, ముదిరాజులకు మంత్రి పదవులు ఇవ్వాలన్నారు. ఈ నెల 30న తేదీన భువనగిరిలో ముగింపు యాత్ర ఉంటుందన్నారు. పల్సన్, మహ్మద్ నజీరుద్దీన్, ఎం.రమేష్, శ్రీనివాస్, మధు, ప్రశాంత్, దేవదాస్, దళితదండు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రమొల్ల మొగులయ్య, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీరేందర్ పాల్గొన్నారు.

ఫోర్త్‌సిటీతో శరవేగంగా కల్వకుర్తి అభివృద్ధి

- సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో దక్షిణ తెలంగాణకు మహర్దశ
- అభివృద్ధిలో విపక్షాలు కలిసి రావాలి
- పీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

ఆమనగల్లు, సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫోర్త్‌సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటునేపథ్యంలో కల్వకుర్తి నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, రాజకీయాలకు చోటు లేకుండా అన్ని పార్టీలు, ప్రజలు అభివృద్ధి విషయమై కలిసిరావాలని పీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు, సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కల్వకుర్తి ప్రాంతానికి మహర్దశ కలుగుతుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, ప్రభాకర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, జిల్లా నాయకుడు మండ్లి రాములు, మాజీ ఎంపీపీలు ధనుంజయ్య, అనితా విజయ్, మాజీవైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్య నాయక్ లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ముచ్చర్లలో ఫోర్త్‌సిటీ నిర్మాణంతో ఉమ్మడి రంగారెడ్డి, పాలమూరు జిల్లాలకు ఎక్కువ మేలు జరిగి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సైబరాబాద్‌కు సమాంతరంగా ఫోర్త్‌సిటీతో అభివృద్ధి చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి సంకల్పానికి ప్రతీఒక్కరు తోడ్పాటునందించాలన్నారు. దశాబ్దాల కాలం తర్వాత ప్రాంతం అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేని కొన్ని స్వార్థశక్తులు అసత్య, దుష్ప్రచారాలకు తెరతీసి ప్రజలను అయోమానికి గురిచేయడం తగదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెంది, ప్రజలకు మేలు జరగాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఫోర్త్‌సిటీ కాదు.. ఫోర్‌బ్రదర్స్ సిటీ అని కేటీఆర్ ఎద్దేవా చేయడం కుట్ర రాజకీయాలకు నిదర్శనమన్నారు. నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు భాస్కర్ రెడ్డి, సురేశ్ నాయక్, రామకృష్ణ, అజీమ్, డిగ్రీకృష్ణ, వస్పుల శ్రీశైలం, మహేశ్, యాదయ్య, ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

దంపుడు బియ్యం సొసైటీ స్థలాన్ని దక్కించుకుంటాం

అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తాం

రూ.5కోట్ల విలువైన స్థలం.. కాగితాలు మాయం : బక్కని నర్సింహులు

షాద్‌నగర్, సెప్టెంబరు 22: షాద్‌నగర్ పట్టణంలోని అత్యంత విలువ చేసే దంపుడు బియ్యం సొసైటీ స్థలాన్ని ఎలాగైనా దక్కించుకుంటామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు స్పష్టం చేశారు. రూ.కోట్ల విలువ చేసే స్థలానికి సంబంధించిన కాగితాలు నేడు మాయమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నేత బాబర్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరాంజనేయులుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. నర్సింహులు మాట్లాడుతూ పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో 900 గజాల స్థలంలో దంపుడు బియ్యం సొసైటీ ఉండేదని, దానిని మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకొని పార్క్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే, ఈ స్థలం తమదేనంటూ 1958లో అప్పటి మాజీ ఎమ్మెల్యే రాయికల్ దామోదర్‌రెడ్డి పేరిట అగ్రిమెంట్ ఉందంటూ.. ఆయన సంబంధీకులు మున్సిపాలిటీపై కోర్టులో దావా వేశారు. ఈ కేసుకు సంబంధించి మున్సిపల్ అధికారులు తగిన ఆధారాలు చూపనందున స్థలాన్ని దామోదర్‌రెడ్డి సంబంధీకులకే చెందుతుందంటూ ఇటీవల కోర్టు తీర్పు ఇచ్చిందని బక్కని పేర్కొన్నారు. అప్పట్లోనే ఈ స్థలంపై వివాదం చెలరేగడంతో 2002లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ మధుసూధనరావు, ఆ తర్వాత వచ్చిన పురుషోత్తమ్‌రెడ్డి స్థలాన్ని సంరక్షించాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారని గుర్తుచేశారు. కాగా, ఆ స్థలానికి సంబంధించిన పత్రాలు తనవద్ద ఉన్నాయని, అది దంపుడు బియ్యం సొసైటీకి చెందిన స్థలం అని నిరూపించడానికి పూర్తి ఆధారాలు ఉన్నాయని బక్కని తెలిపారు. రాజకీయాలకతీతంగా సొసైటీ స్థలాన్ని పరిరక్షించుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

అనంతగిరిలో పర్యాటకుల సందడి

పర్యాటక ప్రాంతం అనంతగిరికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. హైదరాబాద్ జంట నగరాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పర్యాటకులు పెద్దఎత్తున అనంతగిరికి తరలివచ్చి ప్రకృతి అందాల మధ్య సందడి చేశారు. ముందుగా అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్న భక్తులు తరువాత అనంతగిరి వ్యూ పాయింట్ల వద్ద సందడి చేశారు. దేవాలయం పక్కనే ఉన్న ఛత్రీలు, నందిఘాట్, వ్యూపాయింట్ వద్ద సందడి చేశారు. పుష్కరిణి, నందిఘాట్ వద్ద ఫారెస్ట్ అధికారులు ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేయడంతో పర్యాటకులకు లోపలికి అనుమతించారు. ప్రతీ శని, ఆదివారాలు అనంతగిరికి పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. అయితే, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేయగా త్వరలోనే పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

- వికారాబాద్, సెప్టెంబరు 22





అనంతగిరిలో పర్యాటకులు

ఘనంగా విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి



జయంతిలో ముకుంద, ప్రశాంత్, రామకృష్ణ

కందుకూరు, సెప్టెంబరు 21 : కందుకూరులో విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ జయంతిని ఆదివారం జరుపుకున్నారు. సంఘం సీనియక్ నాయకులు కాసోజు ప్రశాంత్ చారి, సిరిగిరి ముకుందచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో నాయకు లు రామకృష్ణాచారి, బ్రహ్మాచారి పాల్గొన్నారు. పాలకులు విశ్వకర్మలకు చేయుతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మా జీ సర్పంచ్ రామక్రిష్ణారెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్‌చారి, నరసింహాచారి, డి.శ్రీనివాసచారి, జగన్‌చారి, సద్గుణ, పవన్, కృష్ణారెడ్డి, రాకేష్‌గౌడ్, వెంకటేష్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

తలకొండపల్లి , సెప్టెంబరు 22:మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామంలో ఈనెల 24న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్ఓ ఎం.ఏ పాష లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ , హైదరాబాద్ యశోధ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వెంకటయ్య సేవలు మరులేనివి



వెంకటయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 22: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, హెచ్‌ఎం టి.వెంకటయ్య సేవలు మరువలేనివని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కాళ్లాపూర్ యూపీఎస్ పాఠశాల హెచ్‌ఎం వెంకటయ్య ఇటీవలే గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. పరిగిలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వెంకటయ్య సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీచర్‌గా పనిచేస్తూనే పరిగి ప్రాంత అభివృద్ధికి నిరంతరం ఆలోచించే వ్యక్తి వెంకటయ్య అని అన్నారు. బహుజన వాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన వ్యక్తి అని కొనియాడారు. పరిగిలో ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మించి ఆయన పేరు నామకరణం చేస్తామని తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి కె.హణ్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, మాలమహానాడు తాలుకా అధ్యక్షుడు బి.వెంకటయ్య, ఎంఈవో హరిశ్చందర్, మాస్ అధ్యక్షుడు గట్యానాయక్, ఆయా పార్టీలు, సంఘాల నాయకులు కడ్మూరు ఆనందం, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, సురేందర్, బి.ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు అమర్‌నాథ్, ఎండీ ఉస్మాన్, కావలి శ్రీశైలం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో ఇంటి నంబర్ల గందరగోళం

- ఎక్మాయి గ్రామస్తుల ఆందోళన



ఇంటి నంబర్ల లోపాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

బషీరాబాద్, సెప్టెంబరు 22: మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన ఓటరు జాబితాలో ఇంటి నంబర్లు గందరగోళంగా ఉన్నాయని గ్రామస్తులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాలో ఒకరి ఇంటి నంబరు మరొకరికి కేటాయించారన్నారు. ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందని, తప్పుల సవరణకు పోలింగ్ బూత్‌ల వారీగా సిబ్బంది సరిచేశారని అధికారులు చెబుతున్నా జాబితాలో ఇంటి నంబర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్‌ను అడిగితే ఇంటి నంబర్ల విషయమై సరైన స్పష్టత ఇవ్వడం లేదని గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, బోయిని భీమయ్య, శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కొత్తగా ఇంటి నంబర్లు వచ్చాయని చెబుతూ ఓ వ్యక్తి ఇంటింటికీ తిరుగుతూ డిజిటల్ ప్లేట్లను బిగిస్తున్నాడని వారన్నారు. అసలే ఓటరు జాబితాలో ఇంటి నెంబర్లు తికమక ఉన్నాయంటే, డిజిటల్ నంబర్ల సంఖ్య మరోవిధంగా ఉందని వాపోతున్నారు. ఇంటి నంబర్ల లోపాలకు సంబంధించి ఎంపీడీవో విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తే పాత నంబర్లు వేయించుకోవాలని చెబుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి ఫోన్ చేసి ఫిర్యాదు చేశామని గ్రామస్తులు తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులతో మట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పినట్లు సమాచారం. ఓటరు జాబితాలో పాత ఇంటి నంబర్లు ఉండేలా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పలువురు కోరుతున్నారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 22: గుర్తుతెలియని వ్యక్తి రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్-అంకుశాపూర్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి(35) రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో రైల్వే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని పరిసరాలను గమనించారు. అచూకీ లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ



ఘటనాస్థలంలో జనం

వికారాబాద్, సెప్టెంబరు 22: కిరాణ షాపులో సిగరెట్ కొనేందుకు వచ్చిన దుండగుడు షాపు నిర్వాహకురాలి మెడలో నుంచి చైన్ లాక్కెల్లాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్‌లోని 31వ వార్డు శివరాంనగర్ కాలనీలో విద్యావతి కిరాణషాపు నిర్వహిస్తోంది. ఓ యువకుడు సిగరెట్ కోసం వచ్చినట్లు వచ్చి విద్యావతి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కొని పరారయ్యాడు. దూరంగా మరో వ్యక్తి కూడా ఇతడితో రాగా ఇద్దరూ కలిసి పరారయ్యారు. ఓ వ్యక్తి వారిని పట్టుకునే ప్రయత్నం చేసినా దుండగులు దొరకలేదు. దీంతో స్థానికులు పోలీసులు సమాచారం అందించగా సీఐ నాగరాజు అక్కడికి చేరుకుని విచారిస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దొంగలను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

బంగారు గొలుసు చోరీకి యత్నం



సీసీపుటేజీలో పోలీసులు గుర్తించిన నిందితులు

కులకచర్ల: స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కిరాణ దుకాణంలో ఉన్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును దొంగిలించేందుకు యత్నించారు. ఈ ఘటన కులకచర్లలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కులకచర్లలో ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఎస్బీఐ ఎదురుగా ఉన్న కిరాణ దుకాణానికి స్కూటీపై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. రోడ్డుపై స్కూటీని నిలిపి ఓ వ్యక్తి వాటర్ బాటిల్ తీసుకెళ్లాడు. మళ్లీ వచ్చి రెండు సిగరెట్లు ఇవ్వమని కోరాడు. దుకాణ నిర్వాహకురాలు రత్నమాల సిగరెట్లు ఇస్తున్న క్రమంలో ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కునే ప్రయత్నం చేశాడు. దీంతో అప్రమత్తమైన రత్నమాల తన రెండు చేతులతో గొలుసును గట్టిగా పట్టుకుని కేకలు వేసింది. దీంతో దుండగులు అక్కడి నుంచి స్కూటీపై పరారయ్యారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి సమీప సీసీ కెమెరాల ఫుటేజీల ద్వారా దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి పంటకు చీరలే రక్ష



పత్తి పొలం చుట్టూ కంచెలా ఏర్పాటు చేసిన చీరలు

కొడంగల్ రూరల్, సెప్టెంబరు. 22: వానాకాలం పత్తి సాగు చేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. జంతువులు, కోతుల నుంచి పంటను రక్షించుకునేందుకు తమ ఆలోచనకు పదును పెడుతున్నారు. కొడంగల్ మండలంలోని నాగారం గ్రామశివారులో రైతు సాగుచేసిన పత్తి పంట పొలం చుట్టూ చీరలను కంచెలా ఏర్పాటు చేశాడు. రాత్రి వేళల్లో గాలి వీచినప్పుడు శబ్దాలు రావడంతో పంట పొలాల వైపు అడవి జంతువులు రావడం లేదని రైతులు అంటున్నారు. దీంతో పంట పొలాల్లో సాగు చేసిన పత్తి పంటకు కోక కంచె శ్రీరామరక్షగా ఉందని రైతులు తెలిపారు.

గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్స్ అందజేత



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 22: మండలంలోని మేడిచెట్టు తండాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్స్‌ను కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. జాబితాలో లేని వారు గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజునాయక్, వినోద్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, నవిషి నాయక్, మోహన్ నాయక్, సక్రియ నాయక్, తండావాసులు సుశీల బాయి, లక్ష్మీబాయి, జానకిబాయి, చక్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



మైనార్టీ రెసిడెన్షియల్‌లో వంటగదిని పరిశీలిస్తున్న ఎంఈవో

పరిగి, సెప్టెంబరు 22: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని పరిగి ఎంఈవో హరిశ్చందర్ సూచించారు. పరిగిలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. వంట గదులను, సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యత గల మంచి ఆహారాన్ని అందించాలని సూచించారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీసే విధంగా టీచర్లు కృషి చేయాలన్నారు. టెన్త్‌లో 10/10 సాధించేలా లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు.

అలియాబాద్‌లో మహా అన్నదానం



అన్నదానం చేస్తున్న గణేష్ ఉత్సవాల నిర్వాహకులు

శామీర్‌పేట, సెప్టెంబరు 22: అలియాబాద్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గణేష్ ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలో షేక్‌మహబూబ్ జ్ఞాపకార్థం అతడి మిత్రులు, గణేష్ ఉత్సవాల నిర్వాహకులు మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినాయక భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి భోజనాలు చేశారు.

పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గం



పీఆర్‌టీయూ నూతన కార్యవర్గ సభ్యులు

దోమ, సెప్టెంబరు 22: తిమ్మాయిపల్లిలో ఆదివారం పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆర్.కేశవులు, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌సింగ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా స్వప్న, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకట్రాములు, సత్యనారాయణ, మహిళా కార్యదర్శిగా కృష్ణవేణి, కార్యదర్శులుగా రాజ్‌కుమార్, నాగరాజును ఎన్నుకున్నారు.

ఎంపీ మాటలు బాధ్యతారాహిత్యం



సేవ్ దామగుండం ధర్నాకు తరలివెళుతున్న నేతలు

వికారాబాద్, సెప్టెంబరు 22: దామగుండం సమస్యపై ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి కనీస అవగాహన లేకుండా ప్రాజెక్టుపై ఎలాంటి సమాచారం లేకుండా బాధ్యతా రహిత్యంగా మాట్లాడడం దారుణమని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ అన్నారు. హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరుగుతున్న సేవ్ దామగుండం నిరసన కార్యక్రమానికి ఆదివారం వికారాబాద్ నుంచి మద్దతు దారులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12లక్షల చెట్లు పోతున్నట్లు నేవీ అధికారులు కోర్టుకు సబ్మిట్ చేసిన డాక్యుమెంట్లు పబ్లిక్ నోటీసు ఒకసారి పరిశీలన చేసుకోవాలని సూచించారు. గొర్లు, బర్లు, మేకలు పోయి అడవులను నాశనం చేస్తున్నాయని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో పశువులు అడవుల్లో మేత మేయకుంటే ఎక్కడ మేయాలో ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి సమాధానం ఇవ్వాలన్నారు. అడవిని విధ్వంసం చేసి ఈ ప్రాజెక్టును ఇక్కడే పెట్టాల్సిన అవసరమేంటో చెప్పలేదన్నారు. వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్‌తో వికారాబాద్ జిల్లాకు స్థానిక ప్రజలకు ఏ ఉపయోగం జరుగుతుందో చెప్పకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామన్న మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, సుబానయ్య, రాజేష్, సుభాష్, రవి యాదవ్, ప్రవీన్, మహేష్, మాణిక్యం, శంకర్‌నాయక్, శ్రీకాంత్, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కులకచర్ల: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కులకచర్ల, సెప్టెంబరు 22: మండలంలోని పుట్టపహాడ్ గురుదత్త ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1994-95 పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తాము చదివిన పాఠశాలలో అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, అంజిలయ్య, కేశవులు తదితరులను పూలమాలలతో సన్మానించారు. 40 సంవత్సరాల తర్వాత కలుసుకొని వ్యక్తిగత విషయాలు మాట్లాడుకున్నారు. తమ ఆనందాన్ని వ్యక్తపర్చారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు.

పెద్దేముల్: మండలంలోని మంబాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన 2007-2008 సంవత్సరం విద్యార్థులు ఆదివారం ఒకేచోట చేరారు. వారు చదువుకున్న పాఠశాలే ఇందుకు వేదికైంది. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఆడిపాడి ఆనందంగా గడిపారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



పెద్దేముల్: పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు

ఉచిత వైద్యం అందించడం అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 22: ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో జమియత్ ఏ ఉలేమా, ముజ్తబా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈక్యాంపులో 1100 మందికి పరీక్షలు చేశారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు అబ్దుల్ రవూఫ్, కమల్ అతర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట్: ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా నాయకులు

మోమిన్‌పేట్: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. మండలంలోని మేకవనంపల్లి గ్రామంలో ఆదివారం మా శారద ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బీజేపీ జిల్లా కో ఆర్డినేటర్ వడ్ల నందుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ కొప్పుల రాజశేఖర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, రమేశ్, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, నాయకులు లక్ష్మణ్, మల్లేశ్ యాదవ్, శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదారంలో ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పరిగి: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పరిగి మండలం మాదారం గ్రామంలో ఉచిత కంటివైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరంలో 156 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎనిమిది మందికి కంటి ఆపరేషన్‌లకు నిర్ధారించారు. కంటి చికిత్సలు చేయించుకునన 80 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిసేవాసమితిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బి.నర్సింహులు, జ్ఞానేశ్వర్‌లు ఉన్నారు.

రూ.1.56లక్షలు పలికిన గణేశుడి లడ్డు



వేలంలో లడ్డూను దక్కించుకున్న సంతోష్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 22 : మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో శివాజీ యూత్ వారు నిర్వహించిన వినాయక లడ్డూ వేలంలో మాజీ ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి తనయుడు వీర్లపల్లి సంతోష్‌రెడ్డి రూ.1.56లక్షలకు వేలంపాడి లడ్డును సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీర్లపల్లి రాజమల్లారెడ్డి, బాబుల్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, సెప్టెంబరు 22: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన వడ్ల సుమలత(16) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో బాధిత కుటుంబసభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, నాయకులు సాయి, దస్తప్ప, రాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీలు



బాడీ బిల్డింగ్ పోటీ విజేతలతో కోచ్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 22: పట్టణంలోని ఎక్స్‌ట్రీమ్ ఫిటనెస్ జిమ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించారు. మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జిమ్ నిర్వాహకులు ఈ పోటీలను నిర్వహించారు. ఫిట్ నెస్ పరంగా బాడీ బిల్డర్స్ డెడ్‌లిఫ్ట్, పుషప్‌లో ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. జిమ్‌లో ఫిటనెస్‌తో పాటు బాడీ బిల్డింగ్ పోటీల్లో జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాలనుకునే యువకులకు అధునాతన పరికరాలతో ట్రెయినింగ్ ఇస్తున్నట్లు కోచ్ పృథ్వీ తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా శంకర్ సింగ్ వ్యవహరించారు. విజేతలకు బీఆర్ఎస్ మేడ్చల్ మైనార్టీ సెల్ నాయకుడు ఎండీ ఖాజా మోయినుద్దీన్ చేతుల మీదుగా బహుమతులు, పతకాలు అందజేశారు.

శివాలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేసిన డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి

కులకచర్ల, సెప్టెంబరు 22: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శివాలయానికి డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి భారీ విరాళాన్ని అందజేశారు. మండల వీరశైవ సమాజం ఆధ్వర్యంలో శివాలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు అందిస్తున్నారు. అందులో భాగంగా కమిటీ సభ్యులు ఆదివారం డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డిని కలవగా భీమ్‌రెడ్డి దంపతులు రూ.లక్షా 20వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం



డ్రైనేజీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి, సెప్టెంబరు 22: పట్టణ ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య విమర్శించారు. మునిసిపల్ పరిధిలోని ఐదవవార్డులో ఆదివారం ఇళ్ల మధ్య పారుతున్న మురికి నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల మధ్య మురికినీరు నిలిచి దోమలకు అవాసాలుగా మారాయని తెలిపారు. దోమల వల్లే ప్రజలు అనేక రోగాలబారిన పడుతున్నారని తెలిపారు. మునిసిపల్ అధికారులు స్పందించి పరిష్కరించకపోతే కార్యాలయాన్ని ముట్టిడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్తయ్య, రఘురాం, రాచంద్రయ్య ప్రశాంత్, అశోక్, బలరాం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెయినీ ఎస్ఐకి ఘన సన్మానం



ట్రెయినీ ఎస్ఐని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ దంపతులు

బషీరాబాద్, సెప్టెంబరు 22: మండలంలోని జీవన్గి బర్కాలకు చెందిన రథోడ్ మంజూల ఎస్ఐ శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామానికి వచ్చింది. ఈ సందర్భంగా బషీరాబాద్ మాజీ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ ఆమె నివాసం వద్ద ఆదివారం ట్రైనీ ఎస్ఐని శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు నర్సింహులు, ఏఎంసీ సభ్యులు నరేష్ రథోడ్ సంతోష్, శ్రీకాంత్, ముక్తార్, ఇషాక్, ప్రదీప్, వడ్డే జగదీష్ పాల్గొన్నారు.

యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 22: యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఎస్‌సీసెల్ అధ్యక్షుడు పత్తికుమార్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు మీసాల అరుణ్‌కుమార్, సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, దాసు, రామలింగం, కిరణ్, సతీష్, నర్సింగరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

బొంరాస్‌పేట్, అక్టోబరు 22: మండలంలోని కొత్తూర్, వడిచర్ల, మహంతీపూర్, జానకంపల్లి, ఏనమీదితండా, లింగయ్యనాయక్ తండా, జీడీ గడ్డ తండా, హనుమాన్‌నాయక్ తండాల్లో మంగళవారం(రేపు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ నవీన్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో అన్నారు. కొత్తూర్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మాజీ మంత్రిని కలిసిన బీసీ సంఘం మండల అధ్యక్షుడు నరేందర్

బషీరాబాద్, సెప్టెంబరు 22: మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు బషీరాబాద్ మండల బీసీ సంఘం అధ్యక్షులు తలారి నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రితో మండలానికి చెందిన బీసీలకు సంబంధించి పలు అంశాలపై చర్చించినట్లు ఆయన చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుంటే మరోసారి బీసీ సామాజిక వర్గం ఉద్యమం చేయడానికి ఏకధాటిపైకి రావాలని మాజీ మంత్రి సూచించారని అన్నారు.